వైఎస్సార్‌సీపీతోనే మేమంతా..

- స్పష్టం చేసిన 5, 6, 7 వార్డుల నాయకులు
- మాజీ మంత్రి అవంతితో మర్యాదపూర్వక కలయిక



మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసిన వైఎస్సార్‌సీపీ మధురవాడ నాయకులు

మధురవాడ : ఎన్ని ఆటుపోట్లు వచ్చినా.. తామంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామని, ప్రజల పక్షాన పోరాడుతామని జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పార్టీ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం పలువురు వేర్వేరుగా మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి తామంతా ఆయనతో పాటు పార్టీ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. జగనన్న నాయకత్వాన్ని బలపరిచే విధంగా, పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ముత్తంశెట్టిని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ కల్చరల్ వింగ్ రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, మాజీ సర్పంచ్ కుడితి రామారావు, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు పిల్లా పాపారావు, వివిధ విభాగాల నాయకులు పెంఢ్ర అప్పన్న, పీవీజీ అప్పారావు, పుసుపులేటి గోపి, నెంబర్ రమణమ్మ, బంగారు ప్రకాశ్, బెల్లాపు పాపారావు, వరలక్ష్మి, శివ, సూర్య నారాయణ తదితరులు ఉన్నారు.

దుర్గాలమ్మకు పసుపు, కుంకుమ సమర్పణ



ప్రత్యేక అలంకరణలో దుర్గాలమ్మ



అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు



అమ్మవారి ఊరేగింపులో ఆకట్టుకున్న గిరిజనుల కొమ్ము నృత్యం

తగరపువలస : భీమిలి జోన్ 1,2 వార్డులకు చెందిన సంతపేట, కొత్తపేట, వెలంపేట, విల్సన్‌పేట, కారిమ్రకవాడ ప్రజలు శుక్రవారం చిట్టివలస బొగ్గరోడ్డులోని దుర్గాలమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. అమ్మవారిని పూలదండలతో మధుర మీనాక్షి రూపంలో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. సంతపేట గొల్లవీధిలోని అమ్మవారి చదురు నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో బాణసంచా, సాముగరిడీ, పులివేషాలు, మహిళల నృత్యాలు, గిరిజన సాంప్రదాయ కొమ్ము బూరల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎండ బారిన పడి ఆలయానికి వచ్చే భక్తులకు నీడనిచ్చేందుకు టెంట్లు, మజ్జిగ, తాగునీరు, పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న అర్చకులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా మంగళవాయిద్యాల నడుమ శ్రీవారిని శేషవస్త్రం, అభిషేక సామగ్రితో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గాం గంటం దొరకు ఘన నివాళులు



గాం గంటం దొర చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గిరిజన్ భవన్ ఉద్యోగులు

కొమ్మాది: రుషికొండ బీచ్‌రోడ్డులో గల గిరిజన సాంస్కృతిక పరిశోధనా శిక్షణ భవన్‌లో గిరిజన సమరయోధుడు గాం గంటం దొర శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గంటం దొరకు భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చినబాబు సిబ్బందితో కలిసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం గంటం దొర పోరాటాలు చేశారని అన్నారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలోనూ గంటం దొర కీలక పాత్ర పోషించారన్నారు.

మురుగు తొలగించారు



మురుగును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో పేరుకుపోయిన మురుగును పారిశుధ్య సిబ్బంది శుక్రవారం తొలగించారు. వార్డులో పారిశుధ్య లోపం, దుర్గంధంతో స్థానికుల అవస్థలపై సాక్షి పత్రికలో శుక్రవారం 'కాలువల్లో మురుగుతో దుర్వాసన' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపి, రుషికొండ, ఎండాడ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో నిల్వ ఉన్న మురుగు నీరు, వ్యర్థాలను తొలగించారు.

మహిళ అదృశ్యం



సునీత (ఫైల్)

పీఎం పాలెం: మహిళ అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి.. జీవీఎంసీ 5వ వార్డు మారికవలసలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ బ్లాకు నంబరు 14 జీఎఫ్-1లో చెంబు సునీత ఏడాదిగా ఒంటరిగా నివసిస్తున్నారు. ఆమె భర్త, కుమారుడు కాకినాడలో ఉంటున్నారు. ఆమె తమ్ముడు రఘునాథ్ గత నెల 30న ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో, ఎటో వెళ్లి ఉంటారని భావించి వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు వచ్చి చూడగా ఇంటికి తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వారిని విచారించగా తమకు తెలియదని తెలిపారు. రఘునాథ్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలియజేశారు.

పువ్వుల రైతుల ఎదురీత

- అన్‌సీజన్ కావటంతో పలకని ధర

తగరపువలస: అన్‌సీజన్ కారణంగా పువ్వులకు ధర పలక్క భీమిలి నియోజకవర్గంలో పూల రైతులు ఎదురీదుతున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో మల్లె, కనకాంబరాలు, విరజాజులు దిగుబడికి వస్తున్నాయి. వీటిని సాగు చేసే రైతులందరివీ చిన్నకమతాలే కావటంతో వీరికి పెట్టుబడి ఖర్చులు భారంగా మారాయి. ముఖ్యంగా పువ్వులు ఏరడానికి కూలీల కొరత ఎక్కువగా ఉంది. చాలా వరకు రైతులు ఉపాధి హామీ పనులకు వెళ్లిపోతుండటంతో సాగు చేసే రైతులకు వీటి ఏరివేత కష్టంగా మారింది. ఏదో విధంగా పువ్వుల ఏరివేత సాగినా మార్కెట్‌లో వీటికి ధర లేకపోవడంతో వెనుకడుగు వేస్తున్నారు దీనికి తోడు పురుగుల మందు, యంత్ర పరికరాల వినియోగం ఈ సాగులో అవసరం. వీటి ఖర్చు తడిసి మోపెడు కావడంతో రైతులు ముందుకు సాగడం లేదు ప్రస్తుతం ఆనందపురం హోల్‌సేల్ పువ్వుల మార్కెట్‌లో వీటి ధర రూ. 300 మించడం లేదు. వీటి ఏరివేతకు రోజుకు రూ.300 వరకు కూలి చెల్లించినా మనుషులు అందుబాటులో ఉంటం లేదు. ఈ మార్కెట్‌కు విజయవాడ, రాజమండ్రి, కడియం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి గులాబీ, చామంతి వంటి హైబ్రిడ్ రకాల పువ్వుల దిగుమతులు కూడా ఎక్కువగా ఉండటంతో వీటి నుంచి స్థానిక దిగుబడులు పోటీ ఎదుర్కొంటున్నాయి. పువ్వులకు ఆషాఢం తర్వాత శ్రావణంలో ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. అప్పటికి ఉపాధి హామీ పనులు లేకపోతే పువ్వుల సాగు, ఏరివేతకు కూలీలు అందుబాటులో ఉంటారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ముగింపు శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస : భీమిలి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మహేష్ విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, క్యారమ్స్ తదితర ఆటల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డి.ఈశ్వరరావు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఇంకా ఎంఎఫ్‌యూసీ స్కూల్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలతో ఇబ్బందులు



పువ్వుల మార్కెట్ ఆటోస్టాండ్ వద్ద పందుల గుంపు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస జాతీయ రహదారిని ఆనుకుని మహాత్మాగాంధీ పువ్వుల మార్కెట్ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద చికెన్ వ్యర్థాలు పారవేస్తుంటడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో చికెన్ వ్యాపారులు వ్యర్థాలను జాతీయ రహదారి పక్కనే పడేస్తుండటంతో ఇక్కడి స్టాండ్ వద్ద వేచి ఉండే ప్రయాణికులు దుర్వాసనతో సతమతం అవుతున్నారు. ఇక్కడ గుట్టలుగా పేరుకుపోతున్న చికెన్ వ్యర్థాలను ఏరుకోవడానికి పక్షులు, పందులు, కుక్కలు నిత్యం పోట్లాటలకు దిగుతూ ప్రయాణికులపై దాడులకు దిగుతున్నాయి. ఈ సందర్భంగా చాలా మంది కుక్క కాట్లకు కూడా గురయ్యారు. ఈ నేపథ్యంలో చికెన్ వ్యర్థాలు ఈ సమీపంలో వేయకుండా చూడాలని స్థానికులు పలుమార్లు వేములవలస పంచాయతీ పాలకవర్గానికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అంటున్నారు. ఈ సమస్యను ఆనందపురం ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

పాత పీఎంపాలెంలో తాగునీటికి కటకట



ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పీఎం పాలెం : జీవీఎంసీ 7వ వార్డులోని పాత పీఎం పాలెంలో గత 5 రోజులుగా తాగునీటి కుళాయిలు మొరాయించడంతో స్థానికులు అల్లాడుతున్నారు. ప్రతిరోజూ తెల్లవారు జాము నాలుగు గంటలకు కుళాయిల ద్వారా తాగునీటిని విడుదల చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగానికి చెందిన రెండు ట్యాంకర్లు పాత పీఎం పాలెంలోకి నీటితో వచ్చాయి. అయితే అప్పటికే పనిపాటలకు వెళ్లిపోయిన స్థానికులు నీటిని పట్టుకోలేకపోయారు. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి వీధి కుళాయిలను పనురుద్ధరించాలని, నీళ్ల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసే సమయం ముందుగా తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీరు వృథా



మారికవలస హైవే పక్కన వృథాగా పోతున్న తాగునీరు

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీని ఆనుకుని ఉన్న హైవేపై గత కొద్ది రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడ ఆర్‌జీకే పాత-కొత్త కాలనీల మధ్య ప్రతిపాదించిన సర్వీసు రోడ్డులో పైపులైను పగిలిపోయింది. దీంతో విలువైన నీరు వృథాగా పోతున్నా సంబంధిత సిబ్బంది గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు విధిగా మొక్కలు నాటాలి

- వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలి
- మ్యాజిక్ బస్ ప్రతినిధులు



మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న మ్యాజిక్ బస్ ప్రతినిధులు

తగరపువలస: విద్యార్థులు పబ్లిక్ స్థలాల్లో విధిగా మొక్కలు పెంచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కోరారు. భీమిలి మండలం మజ్జిపేట జెడ్పీహైస్కూల్ ఆవరణలో శుక్రవారం పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు చార్టులపై బొమ్మల పోటీ నిర్వహించి, బహుమతులు అందించారు. అనంతరం పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటిన దగ్గర నుంచి పెద్దవి అయ్యేంతవరకు వాటి సంరక్షణ బాధ్యతలు విద్యార్థులే తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం వల్లభదాసు బాలాజీ, స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మణరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారి రాజేశ్వరి, ఏఎన్ఎం రమణమ్మ, ఆశ వర్కర్ ఈశ్వరమ్మ, మ్యాజిక్‌బస్ ట్రైనింగ్ కమ్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్, టీమ్ సభ్యులు శారద, దుర్గ, రమ్య, రమణమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను పాఠశాలకు పంపిస్తే ప్రోత్సాహకాలు



రెడ్డిపల్లిలో దివ్యాంగ బాలుడితో సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ గీత



పద్మనాభంలో దివ్యాంగ బాలుడితో అధికారులు

పద్మనాభం: దివ్యాంగ బాలలను పాఠశాలలకు పంపిస్తే ప్రత్యేక పోత్సాహకాలు అందిస్తామని సమగ్ర శిక్షా అభియాన్ సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ బి.గీత అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి, పద్మనాభం గ్రామాల్లో బడి బయట ఉన్న 18 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లల సర్వేను ఆమె, ఎంఈవో పొన్నగంటి రమణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వయసు గల, 21 రకాల అంగవైకల్యాలు గల దివ్యాంగ విద్యార్థులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. ఈ సర్వేను మే ఒకటి నుంచి ప్రారంభించామని, ఈ నెల తొమ్మిదితో ముగుస్తుందని చెప్పారు. పద్మనాభం మండలంలో ఇంతవరకు బడి బయట ఉన్న 20 మంది దివ్యాంగ విద్యార్థులను గుర్తించామన్నారు. భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ బాలలకు ఉపకార వేతనాలు, ఎస్కార్ట్, రీడర్, హెచ్‌బీఈ, గర్ల్ చైల్డ్ అలవెన్సులను ఏడాదికి రూ.3వేలు ఇస్తామన్నారు. అలాగే వారికి ఫిజియోథెరపీ చేస్తారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ఏపీవో అప్పలనాయుడు, ప్రత్యేక ఉపాధ్యాయులు హెచ్. రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూతపడిన వాకింగ్ ట్రాక్



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్ ట్రాక్

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వాకింగ్ ట్రాక్‌ను కొద్ది రోజులు మూసివేస్తున్నట్లు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పీవీఎస్ రాజు తెలిపారు. మట్టితో నిర్మించిన ఈ వాకింగ్ ట్రాక్ మరమ్మతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నెల 11 వరకు మూసివేసి, 12వ తేదీన తిరిగి తెరుస్తామని వారు చెప్పారు. సభ్యులు, వాకర్లకు సమాచారం నిమిత్తం నోటీసు బోర్డులో పెట్టామన్నారు. వాకర్లు సహకరించాలని వారు కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



సిమెంట్ పలకలు పగిలిపోవడంతో రోడ్డు మధ్య ఏర్పడ్డ గొయ్యి

భీమునిపట్నం: మెయిన్‌రోడ్డులోని శివాలయం ఎదురుగా బీచ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు మధ్య ఏర్పడిన గొయ్యితో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండేళ్ల క్రితం ఈ రోడ్డు కింద నుంచి వెళ్తున్న మురుగు కాలువ పూడుకుపోవడంతో అధికారులు రోడ్డును పగలగొట్టి కింద ఉన్న కాలువకు మరమ్మతులు చేశారు. అనంతరం కాలువను మూసివేసి, దానిపై సిమెంట్ పలకలతో మూసివేశారు. కాగా కొద్ది రోజుల క్రితం ఈ పలకలు పగిలిపోవడంతో దాని కింద గొయ్యి బయటపడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బదులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో వీధి లైట్లు సరిగ్గా లేకపోవడంతో ద్విచక్రవాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి, నడిచి వెళ్లేవారు చాలా మంది పడిపోతుండడంతో గాయపడుతున్నారు. అధికారులు స్పందించి, ఈ గొయ్యి మరింత పెద్దది కాకముందే, దీనిపై కొత్త పలకలను ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్ వీరంగం

కార్ షెడ్ జంక్షన్‌లో ఘటన



వాహనచోదకులకు ఆటంకం కలిగిస్తున్న కానిస్టేబుల్

మధురవాడ : పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కార్‌షెడ్ జంక్షన్‌లో ఓ కానిస్టేబుల్ తాగిన మైకంలో చిందులు వేశాడు. శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వచ్చి సిగ్నల్ దాటిన తర్వాత తూలిపడ్డాడు. ట్రాఫిక్ ఎస్ఐ సమక్షంలో కానిస్టేబుల్ బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించే ప్రయత్నం చేసినా అతను సహకరించలేదు. కాసేపు వాహనదారులకు ఇబ్బంది కలిగించాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు అతన్ని పట్టుకుని బలవంతంగా పరీక్షలు నిర్వహించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. పూజలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఇలా అయితే ఎలా?



పార్కులో నిల్వ ఉంచిన పాత సామాన్ల బస్తాలు



పార్కులో మద్యం సీసాలు

- ఆకతాయిలకు అడ్డాగా పార్కు
- పాత వస్తువులతో నింపేస్తున్న స్క్రాప్ వ్యాపారి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ జీవీఎంసీ పార్కు ఆకతాయిలకు, మందుబాబులకు, వ్యాపారులకు అడ్డాగా మారింది. ఈ పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చని చెట్లతో స్థానికులకు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఉదయం, సాయంత్రం సీనియర్ సిటిజన్లు, మహిళలు ఇక్కడ వాకింగ్ చేసేవారు. ప్రస్తుతం సాయంత్రం అయితే మందుబాబులు పార్కులో పార్టీలు చేసుకోవడం, ఆకతాయిల అల్లర్లతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు ఈ ప్రాంతానికి చెందిన స్క్రాప్ వ్యాపారి బస్తాలతో పాత వస్తువులను ఇక్కడే నిల్వ చేస్తున్నాడు. దీనిపై స్థానికులు గతంలో జీవీఎంసీ శానిటేషన్ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పటికై నా అధికారులు స్పందించి, పార్కులో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా తాగునీటి బావి



మారికవలస ఆర్‌జీకే కాలనీలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి బావి



చెత్తాచెదారంతో నిండిన తాగునీటి బావి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కొత్త కాలనీలో ఉన్న బావి నిరుపయోగంగా ఉంది. గతంలో ఈ బావి కాలనీ వాసులకు నీటి ఇబ్బందులను తీర్చేది. కాలనీ ప్రారంభానికి ముందు నుంచే ఉన్న ఈ బావి తాగునీరుగా కూడా ఉపయోగపడేది. అయితే, అధికారులు గానీ, స్థానిక కార్పొరేటర్ గానీ పట్టించుకోపోవడంతో అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం చెత్తా చెదారంతో నిండిపోయి, నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్త తొలగించి వినియోగంలోకి తీసుకువస్తే తమకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్వరితగతిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు అధికారులకు సూచించారు. శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి తన ఎంపీ నిధులు రూ.2 కోట్లు, వీఎంఆర్‌డీఏ నుంచి రూ.2.60 కోట్లు కేటాయించారన్నారు. ప్రస్తుతం నిర్మాణ పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని చెప్పారు. డీఈ పట్నాయక్, నాయకులు అయిత ఎర్రయ్య, దువ్వి అప్పారావు, గంట్ల నరసింహమూర్తి, చెవ్వేటి జల్లుబాబు, పువ్వాడ త్రినాథ్, కంచిబోయిన సంతోష్, వేణు, భాగ్యలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లోని పాట్‌ఫారాలపై బోగీల వివరాలు తెలిపే డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్లు ఏసీ బోగీల వివరాలు అనౌన్స్‌మెంట్‌లో తెలియజేసే వారు. ఇప్పుడు ప్రత్యేకంగా ఈ డిజిటల్ బోర్డుల ద్వారా ఎక్కడ ఏ బోగీ ఉందో ప్రయాణికులకు తెలిసే విధంగా ఏర్పాటు చేశారు. డిజిటల్ బోర్డుల వల్ల ఉపయుక్తంగా ఉంటుందని ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.